ఎన్నికల యుద్ధానికి 'సిద్ధం'

- సమరోత్సాహంతో వైఎస్సార్ సీపీ శ్రేణులు
- నేడు ఆశ్రం జంక్షన్, సహారా గ్రౌండ్స్‌లో భారీ సభ



పార్టీ శ్రేణులను ఆకర్షిస్తున్న ఫ్లెక్సీలు


సిద్ధం సభకు మేము సైతం అంటున్న నాయకులు

ఏలూరు టౌన్: ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి ఎన్నికల సమరభేరి మోగించనున్నారు. ఇప్పటికే ఎన్నికల రణరంగంలోకి దూకేసిన వైఎస్సార్ సీపీ ఇక యుద్ధానికి సిద్ధమైంది. వైఎస్సార్ సీపీ నేతలు, క్యాడర్‌కు దిశా నిర్దేశం చేస్తూ సమరశంఖారావాన్ని పూరించనున్నారు. ఏలూరు శివారు ఆశ్రం జంక్షన్ సమీపంలో సహారా గ్రౌండ్స్‌లో శనివారం చేపట్టే సిద్ధం ఎన్నికల సన్నాహక భారీ బహిరంగ సభకు ఏర్పాట్లు పూర్తయ్యాయి. సీఎం జగనన్న రాకకోసం పార్టీ శ్రేణులు ఆసక్తిగా ఎదురుచూస్తున్నారు. సిద్ధం సభకు విశేష స్పందన వస్తుండడంతో ప్రతిపక్షాలకు గుండెల్లో దడ మొదలైందంటున్నారు.

ఆకర్షణీయంగా ఫ్లెక్సీలు

ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి సిద్ధం సభకు భారీగా ఫ్లెక్సీలు ఏర్పాటు చేశారు. సిద్ధం అంటూ సీఎం జగన్ ఫొటోతో, 175/175, ఫ్యాన్ గుర్తుతో ఏర్పాటు చేసిన రౌండ్ ఫ్లెక్సీలు ఆకర్షిస్తున్నాయి. అభిమానులు సైతం ప్రత్యేకంగా సిద్ధం అంటూ ప్లకార్డులు పట్టుకుని మరీ ఫొటోలు దిగుతూ తమ అభిమానాన్ని చాటుకుంటున్నారు. కొందరైతే వైఎస్సార్ సీపీ జెండాలు పట్టుకుని ఫొటోలు తీసుకుంటూ వైఎస్ జగనన్నపై తమ ప్రేమను వ్యక్తపరుస్తున్నారు.

ప్రత్యేక ఏర్పాట్లు

ఏలూరు నియోజకవర్గం నుంచి వేలాదిగా వైఎస్సార్ సీపీ నేతలు, శ్రేణులు, అభిమానులు తరలివెళ్లేందుకు ఏర్పాట్లు చేశారు. నగరంలోని 50 డివిజన్ల పరిధిలో డివిజన్ కార్పొరేటర్‌తోపాటు, పార్టీ ఇన్‌చార్జీలు, గృహసారథులు, సచివాలయ కన్వీనర్లు, వలంటీర్లు, పార్టీ ప్రతినిధులు పెద్దసంఖ్యలో హాజరయ్యేలా ప్రత్యేక ఏర్పాట్లు చేశారు. ఏలూరు నియోజకవర్గం నుంచి వేలాదిమంది పార్టీ అభిమానులు వెళ్లేందుకు సన్నాహాలు చేసుకుంటున్నారు.

నాని సారథ్యంలో ఏర్పాట్లు

ఏలూరు ఎమ్మెల్యే, వైఎస్సార్ సీపీ జిల్లా అధ్యక్షుడు ఆళ్ల నాని సారథ్యంలో ఏలూరు నుంచి వెళ్లే పార్టీ నేతలు, కార్యకర్తలకు అన్ని సౌకర్యాలు కల్పించేలా చర్యలు చేపట్టారు. డివిజన్‌లో ప్రత్యేకంగా బస్సులు ఏర్పాటు చేయగా, తాగునీరు, ఆహారం, ఇతర ఏర్పాట్లు చేసేలా ఎమ్మెల్యే నాని ఆదేశాలు జారీ చేశారు. కేవలం వైఎస్సార్ సీపీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు మాత్రమే సభకు హాజరయ్యేలా చర్యలు చేపట్టారు.

మైనార్టీలకు సీఎం జగన్‌తోనే భరోసా

వక్ఫ్‌బోర్డ్ జిల్లా చైర్మన్ కామిలుజమా


సమావేశంలో మాట్లాడుతున్న కామిలు జమా

ఏలూరు టౌన్: రాష్ట్రంలో ముస్లిం మైనార్టీల సంక్షేమానికి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి విశేష కృషి చేస్తున్నారని, సామాజిక సాధికారతకు అత్యధిక ప్రాధాన్యత ఇస్తూ మైనార్టీలకు ఆర్థిక, సామాజిక, రాజకీయంగా అభ్యున్నతి సాధించేందుకు బాటలు వేస్తున్నారని ఏలూరు జిల్లా వక్ఫ్‌బోర్డ్ చైర్మన్ డాక్టర్ యండీ కామిలుజమా అన్నారు. ఏలూరులో ఆయన మాట్లాడుతూ సీఎం జగన్ హయాంలో ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ వర్గాలకు అనేక సంక్షేమ పథకాలను అమలు చేశారని, రాష్ట్ర చరిత్రలో ఎన్నడూ ఇలాంటి సంక్షేమ పాలన చూడలేదని తెలిపారు. రాబోయే 2024 సార్వత్రిక ఎన్నికల్లో ముఖ్యమంత్రిగా మరోసారి జగనన్నను ఎన్నుకునేందుకు ముస్లిం మైనార్టీలంతా ఏకతాటిపైకి రావాలని కోరారు. గ్రామాల్లో జగనన్న ఆరోగ్య సురక్ష, వైఎస్సార్ ఆరోగ్యశ్రీ పథకం, 108, 104, ఫ్యామిలీ డాక్టర్ వంటి కార్యక్రమాలతో పేదలకు ఆరోగ్య భరోసా లభించిందని చెప్పారు. ఏపీలో వైద్య,విద్య రంగాల్లో విప్లవాత్మక మార్పులకు శ్రీకారం చుట్టారని తెలిపారు. మహిళా పక్షపాతిగా నిలుస్తూ మహిళల ఆర్థిక, సామాజిక, రాజకీయ అభ్యున్నతికి పాటుపడుతున్నారని వివరించారు. మహిళలకు సమాజంలో పురుషులతో సమానంగా రాజకీయంగానూ ప్రాతినిధ్యం కల్పిస్తూ 50 శాతం సీట్లు మహిళలకే కేటాయిస్తోన్న ఘనత సీఎం జగన్‌కే దక్కుతుందన్నారు. అమ్మఒడి, విద్యాకానుక, పేదలకు ఇళ్లు, వైఎస్సార్ ఆసరా, చేయూత, రైతు భరోసా, ఇలా నవరత్నాలతో పేదల జీవితాల్లో వెలుగులు నింపారని వివరించారు. ఏలూరులో శనివారం జరిగే సిద్ధం ఎన్నికల సన్నాహక సభను విజయవంతం చేయాలని కోరారు. సమావేశంలో వక్ఫ్‌బోర్డ్ వైస్ చైర్మన్ అబ్దుల్ రవూఫ్ (ఆరిఫ్), కార్యదర్శి సలీం పాష ఖాదరి ఉన్నారు.

జగన్‌ను మరోసారి సీఎంని చేయడానికి సిద్ధం


సిద్ధం పోస్టర్లు ఆవిష్కరిస్తున్న గేదెల సూర్యప్రకాష్, స్థానికులు

ఏలూరు (ఆర్ఆర్‌పేట): జగనన్నను మరోసారి ముఖ్యమంత్రిని చేయడానికి ప్రతి ఒక్కరూ సిద్ధంగా ఉన్నారని వైఎస్సార్ సీపీ ఉమ్మడి పశ్చిమ గోదావరి జిల్లా ప్రచార కమిటీ వైస్ చైర్మన్ గేదెల సూర్యప్రకాష్ అన్నారు. శుక్రవారం స్థానిక పోణంగిలో సిద్ధం పోస్టర్‌ను స్థానికులతో కలిసి ఆయన ఆవిష్కరించి మాట్లాడారు. పేదల సంక్షేమమే ప్రధాన లక్ష్యంగా పాలన కొనసాగిస్తూ ప్రజల నుంచి విశేష ఆదరణ పొందుతున్న జగన్ మరోసారి సీఎం కావడం లాంఛనమేనని చెప్పారు. మ్యానిఫెస్టోలో ఇచ్చిన నవరత్నాలు హామీలనే కాక హామీలు ఇవ్వని ఎన్నో వర్గాలకు జగన్ అండగా నిలిచారని వివరించారు. పథకాల అమలులో చరిత్ర సృష్టించారని తెలిపారు. వచ్చే ఎన్నికల్లో జగన్‌ను గెలిపించుకోకపోతే రాష్ట్రం మరో 20 ఏళ్లు వెనక్కి వెళ్లిపోతుందనే ఆలోచన ప్రజల్లో ఉందన్నారు. ప్రతిపక్షాలు ఎన్ని కలిసి వచ్చినా, జగన్‌పై ఎన్ని కుట్రలు చేసినా, ఎంత విషప్రచారం చేసినా ప్రజలునమ్మే స్థితిలో లేరని చెప్పారు. కార్యక్రమంలో స్థానిక నాయకులు ఓగిరెడ్డి లక్ష్మణ రావు, దంపల స్వామి, తెర్లి లక్ష్మీ నారాయణ, చేబత్తిన శేఖర్, పలిపే రమేష్ తదితరులు పాల్గొన్నారు.

సమన్వయంతో సంసార జీవితం కొనసాగించాలి


దిశ వన్‌స్టాప్ సెంటర్‌ను సందర్శిస్తున్న రత్నప్రసాద్

ఏలూరు (ఆర్ఆర్‌పేట) : భార్యాభర్తలు కలహాలకు దూరంగా ఉండి పట్టువిడుపులు, సమన్వయంతో సంసార జీవితం కొనసాగించాలని జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి కె.రత్నప్రసాద్ సూచించారు. రాష్ట్ర న్యాయ సేవాధికార సంస్థ ఆదేశాల మేరకు జిల్లా న్యాయసేవాధికార సంస్థ చైర్మన్, జిల్లా ప్రధాన న్యాయమూర్తి సి.పురుషోత్తమ కుమార్ ఆధ్వర్యంలో శుక్రవారం స్థానిక దిశ వన్‌స్టాప్ సెంటర్‌ను రత్నప్రసాద్ సందర్శించారు. సంసారంలో చిన్నచిన్న తగాదాలు వస్తాయని, భార్య, భర్తలు ఇద్దరూ సర్దుకుపోవడం ద్వారా ఆ సంసారం సాఫీగా సాగుతుందని తెలిపారు. కలహాలు ఉంటే వాటి ప్రభావం పిల్లల భవిష్యత్‌పైనా పడుతుందని హెచ్చరించారు. దిశ వన్‌స్టాప్ సెంటర్ విధివిధానాలను, బాధితులకు అందిస్తున్న కౌన్సిలింగ్ వివరాలను అడిగి తెలుసుకున్నారు. దిశ వన్‌స్టాప్ సెంటర్లో నిర్వహిస్తున్న రిజిస్టర్లను తనిఖీ చేశారు. స్థానిక పత్తేబాదలోని పట్టణ నిరాశ్రయుల వసతిగృహాన్ని సందర్శించి, ఇక్కడ ఆహార పదార్థాలు, వైద్య సదుపాయాలపై ఆరా తీశారు. వృద్ధులకు ప్రభుత్వం అందిస్తున్న పథకాలు, సీనియర్ సిటిజన్ చట్టాలపై అవగాహన కలిగించారు.

సర్వశిక్షా అభియాన్ ప్రాజెక్ట్ కోఆర్డినేటర్‌గా సోమశేఖర్


సోమశేఖర్‌ను అభినందిస్తున్న ఏఎంసీ వైస్ చైర్మన్ రామకృష్ణ

ఏలూరు రూరల్: డిప్యూటీ కలెక్టర్‌గా పదోన్నత పొంది, ఏలూరు జిల్లా సర్వశిక్షా అభియాన్ ప్రాజెక్టు కోఆర్డినేటర్‌గా నియమితులైన తహసీల్దార్ బి.సోమశేఖర్‌ను శుక్రవారం పలువురు అభినందించారు. ఏఎంసీ వైస్ చైర్మన్ కంచన రామకృష్ణ, పలువురు వైఎస్సార్ సీపీ నాయకులు, మండల తహసీల్దార్ కార్యాలయ సూపరింటెండెంట్ గాయత్రి, రెవెన్యూ సిబ్బంది ఆయనకు శాలువ కప్పి పుష్పగుచ్ఛం అందించారు. పేదల ఇళ్ల స్థలాల కోసం ప్రభుత్వం చేపట్టిన జగనన్న కాలనీల భూ సేకరణకు సోమశేఖర్ ఎంతో కృషి చేశారని కొనియాడారు.

అప్రమత్తంగా ఉండాలి

ఏలూరు (ఆర్ఆర్‌పేట): వాహనాలు నడిపే సమయంలో వాహనచోదకులు అప్రమత్తంగా ఉండాలని ఏలూరు అసిస్టెంట్ మోటార్ వెహికల్స్ ఇన్‌స్పెక్టర్ వై.సురేష్‌బాబు సూచించారు. జాతీయ రోడ్డు భద్రతా మాసోత్సవాల్లో భాగంగా శుక్రవారం స్థానిక చొదిమెళ్ల కూడలిలో ఆటో, గూడ్స్ వాహనాల డ్రైవర్లకు రహదారి భద్రతపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. సురేష్‌బాబు మాట్లాడుతూ తక్కువ వేగంతో ప్రయాణించే వాహనాల కంటే అధిక వేగంతో ప్రయాణించే వాహనాలకు ప్రమాదాలు జరిగే అవకాశం ఎక్కువని, అటువంటి ప్రమాదాల్లో ప్రయాణికులకు ప్రమాద తీవ్రత కూడా అధికంగానే ఉంటుందని తెలిపారు. ప్రయాణికుల వద్ద అధిక చార్జీలు వసూలు చేయరాదని, వారితో మర్యాదగా నడుచుకోవాలని, వారిని క్షేమంగా గమ్యస్థానాలకు చేర్చాలని సూచించారు.

ఏలూరు ట్రాఫిక్ ఇన్‌స్పెక్టర్‌గా శ్రీనివాసరావు


బాధ్యతలు స్వీకరిస్తున్న శ్రీనివాసరావు

ఏలూరు టౌన్: ఏలూరు ట్రాఫిక్ ఇన్‌స్పెక్టర్‌గా కె.శ్రీనివాసరావు నియమితులయ్యారు. ఆయన శుక్రవారం ఏలూరులోని ట్రాఫిక్ కార్యాలయంలో ఉద్యోగ బాధ్యతలు స్వీకరించారు. కృష్ణాజిల్లా మచిలీపట్నం ప్రాంతానికి చెందిన శ్రీనివాసరావు 2004 ఎస్సై బ్యాచ్ నుంచి పోలీస్ శాఖలో విధుల్లో చేరారు. తూర్పుగోదావరి జిల్లా సామర్లకోట, కడియం ప్రాంతాల్లో పనిచేస్తూ 2012లో సర్కిల్ ఇన్‌స్పెక్టర్‌గా పదోన్నతి పొందారు. అనంతరం ఉమ్మడి ఏపీలో సీఐడీ విభాగంలో 2014 వరకు పని చేశారు. 2015లో తాడేపల్లిగూడెం టౌన్ సీఐగా రెండేళ్ల విధులు నిర్వర్తించారు. అనంతరం విజయవాడ సిటీకి బదిలీ కావటంతో పలు ప్రాంతాల్లో పనిచేయగా, సైబర్ క్రైమ్ విభాగం నుంచి ఏలూరు సైబర్ క్రైమ్‌కు ఇటీవల బదిలీపై వచ్చారు. ఆయనకు ఏలూరు ట్రాఫిక్ ఇన్‌స్పెక్టర్‌గా పోస్టింగ్ ఇచ్చారు. ఈ సందర్భంగా శ్రీనివాసరావు మాట్లాడుతూ ఏలూరు నగరంలోని ప్రజలకు ట్రాఫిక్ నియమాలపై అవగాహన కల్పిస్తామని, ప్రతి ఒక్కరూ నిబంధనలు విధిగా నిబంధనలు పాటించేలా చర్యలు చేపడతామని తెలిపారు. ఇష్టారాజ్యంగా వాహనాలు నడిపినా, మద్యం సేవించి వాహనాలు నడిపినా చర్యలు తప్పవన్నారు.

ఆర్యవైశ్యుల అభివృద్ధికి సహకరించండి

ఏలూరు (ఆర్ఆర్‌పేట): ఆర్యవైశ్యుల అభివృద్ధికి సహకరించాలని ఏలూరు అర్బన్ జిల్లా ఆర్యవైశ్య సంఘం నాయకులు కోరారు. ఈ నెల 4న స్థానిక సీఆర్‌రెడ్డి కళాశాల ఆడిటోరియంలో నిర్వహించే సంఘం నూతన నాయకుల ప్రమాణ స్వీకార కార్యక్రమానికి వచ్చి ఆశీర్వదించాలని కోరుతూ శుక్రవారం నగరంలోని ఆర్యవైశ్యులకు ఆహ్వాన పత్రికలు అందించారు. దివ్వెల జయప్రకాష్, వేమా సురేష్, మద్దుల రవి కుమార్, బచ్చు విష్ణు, గాదంశెట్టి శ్రీనివాస్, పైడి భీమేశ్వర రావు తదితరులు పాల్గొన్నారు.

జగనన్న ఆరోగ్య సురక్ష పథకం పేదలకు వరం

దెందులూరు: జగనన్న ఆరోగ్య సురక్ష పథకం అందరికీ వరమని దెందులూరు మండల ప్రత్యేకాధికారి ఎస్.కృపావరం, ఎంపీడీఓ పీ.శ్రీలత అన్నారు. శుక్రవారం రామారావుగూడెంలో సచివాలయం వద్ద జగనన్న ఆరోగ్య సురక్ష శిబిరం ఏర్పాటు చేశారు. రోగులకు వైద్య పరీక్షలు చేసి ఉచితంగా మందులు అందజేశారు. సర్పంచ్ పర్వతనేని శ్రావణి సుధీర్, ఎంపీటీసీ కాలి ఇస్రాయేలు, వైఎస్సార్ సీపీ నాయకులు పర్వతనేని వెంకట్రాజు, పర్వతనేని నరేంద్ర, పుల్లా శివప్రసాద్, పేరం ప్రసాద్, బాబ్జి, గ్రామ కార్యదర్శి వీఎస్ చౌదరి, సచివాలయ ఉద్యోగులు, వైద్య బృందం ఉన్నారు.

చేబ్రోలులో రెండో విడత జగనన్న ఆరోగ్య సురక్ష

ఉంగుటూరు: చేబ్రోలు పీహెచ్‌సీ ఆధ్వర్యంలో స్థానిక ప్రాథమిక పాఠశాల వద్ద శుక్రవారం రెండో విడత జగనన్న ఆరోగ్య శిబిరం నిర్వహించారు. 510 మంది రోగులు హాజరయ్యారు. శిబిరంలో డాక్టర్లు శ్రావణ రెడ్డి, వర్మ, భానుప్రకాష్, అశ్విని వైద్యసేవలందజేశారు. ఏఎన్ఎంలు, ఆశ కార్యకర్తలు, సచివాలయ సిబ్బంది సేవలందజేశారు.

మహిళా సాధికారతకు పెద్దపీట

ద్వారకాతిరుమల: ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి మహిళా సాధికారతకు పెద్దపీట వేస్తున్నారని, ప్రతి సంక్షేమ పథకం మహిళలకు లబ్ధి చేకూర్స్తోందని హోం, విపత్తు నిర్వహణ శాఖ మంత్రి తానేటి వనిత అన్నారు. ద్వారకాతిరుమల మార్కెట్ యార్డులో శుక్రవారం ఏర్పాటుచేసిన నాలుగో విడత వైఎస్సార్ ఆసరా సంబరాల కార్యక్రమంలో మంత్రి ముఖ్యఅతిథిగా పాల్గొని మాట్లాడారు. రాష్ట్ర వ్యాప్తంగా ఇప్పటి వరకు నాలుగు విడతల్లో రూ.25,571 కోట్లు వైఎస్సార్ ఆసరా కింద జమ చేసినట్టు చెప్పారు. ఇంత పెద్దమొత్తం రాష్ట్రంలో మరే సంక్షేమ పథకానికి వినియోగించలేదని తెలిపారు. జగనన్న పథకాలతో రాష్ట్రంలో పేదరికం 12 శాతం నుంచి 6 శాతానికి తగ్గిందన్నారు. రాష్ట్రంలో 25 లక్షల ఇళ్ల స్థలాలు ఉచితంగా ఇస్తామని హామీ ఇచ్చిన జగనన్న, 32 లక్షల ఇళ్ల స్థలాలు పంపిణీ చేశారని వివరించారు. బాల కార్మిక వ్యవస్థను నిర్మూలించేందుకు మేనమామలా పిల్లలను చదివించే బాధ్యతను జగనన్న తీసుకుని, విద్యా సంస్కరణలు తీసుకొచ్చారని చెప్పారు. ఇచ్చిన మాట ప్రకారం ముందే సంక్షేమ క్యాలెండర్‌ను ప్రకటించి మరీ సంక్షేమం అందజేస్తున్నారని చెప్పారు. జగనన్న చెప్పాడంటే చేస్తాడంతే.. అవునా కాదా.. అంటూ డ్వాక్రా మహిళలను ఆమె ప్రశ్నించగా.. చేస్తాడు.. చేస్తాడంటూ సభా ప్రాంగణమంతా హోరెత్తింది. వైఎస్సార్ చేయూత, వైఎస్సార్ కాపు నేస్తం, వైఎస్సార్ ఈబీసీ నేస్తం వంటి పథకాలతో ఎస్సీ, ఎస్టీ, బీసీ, కాపు, ఆర్థికంగా వెనుకబడిన అన్ని కులాల మహిళలకు నేరుగా లబ్ధి చేకూర్చారని వివరించారు. రాబోయే రోజుల్లో ఈ ప్రభుత్వాన్ని మనస్ఫూర్తిగా ఆశీర్వదించాలని మంత్రి వనిత కోరారు. కార్యక్రమంలో రాష్ట్ర ఫైనాన్స్ కార్పొరేషన్ డైరెక్టర్ చెలికాని రాజబాబు, జెడ్పీటీసీ చిగురుపల్లి శామ్యూల్, వైస్ ఎంపీపీ యలమర్తి దుర్గాదేవి, సర్పంచ్‌లు దాకారపు బంగారమ్మ, కుంటం స్వర్ణలత తదితరులు పాల్గొన్నారు.

క్లుప్తంగా

ఆరోగ్యశ్రీ పేదలకు వరం


పోణంగిలో మహిళకు ఆరోగ్యశ్రీ కార్డు అందజేస్తున్న నాయకులు

ఏలూరు రూరల్ : ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి ఆరోగ్యశ్రీ పథకం ద్వారా వైద్యం ఖర్చు రూ.25 లక్షలకు పెంచి పేదలకు మరింత మేలు చేశారని ఏఎంసీ వైస్ చైర్మన్ కంచన రామకృష్ణ కొనియాడారు. శుక్రవారం 14వ డివిజన్ పోణంగి సచివాలయంలో ఆరోగ్యశ్రీ కార్డులు పంపిణీ చేశారు. మహానేత వైఎస్ రాజశేఖరరెడ్డి ప్రవేశపెట్టిన ఆరోగ్యశ్రీ పథకాన్ని సీఎం జగన్‌మోహన్‌రెడ్డి పేదల కోసం మరింత చేరువచేశారని రామకృష్ణ తెలిపారు. పోణంగిలో 650 కుటుంబాలు ఈ పథకం ద్వారా లబ్ధి పొందుతాయన్నారు. కార్డు పొందిన ప్రతి కుటుంబం ఖరీదైన కార్పొరేట్ వైద్య సేవలు ఉచితంగా పొందవచ్చన్నారు. వైఎస్సార్ సీపీ నాయకుడు దారం తేజ మాట్లాడుతూ ఐదేళ్ల పాలనలో పేదలకు ఎలా మేలు చేయాలనే ఆలోచనతో సీఎం జగన్‌మోహన్ రెడ్డి పని చేశారని కొనియాడారు. మరోసారి జగన్ సీఎం కావాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో ఆరోగ్య సిబ్బంది పాల్గొన్నారు.

ఓటు హక్కు వినియోగం తప్పనిసరి


అంధులకు ఓటు హక్కు వినియోగంపై అవగాహన కలిగిస్తున్న అధికారులు

ఏలూరు (ఆర్ఆర్‌పేట): జిల్లాలోని 18 సంవత్సరాలు నిండిన విభిన్నప్రతిభావంతులు ఓటరుగా నమోదు చేయించుకుని, వచ్చే ఎన్నికల్లో ఓటు హక్కును తప్పనిసరిగా వినియోగించుకోవాలని విభిన్న ప్రతిభావంతులు, వయోవృద్ధుల సంక్షేమ శాఖ సహాయ సంచాలకులు పి.రాకడమణి సూచించారు. శుక్రవారం స్థానిక వెంకటాపురం ఎలీసా అంధుల వసతి గృహంలో విభిన్న ప్రతిభావంతుల ఓటుహక్కు వినియోగం అనే అంశంపై స్వీప్ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఓటు విషయానికి సంబంధించిన సమాచారం కోసం 1950 నెంబర్‌కు ఫోన్ చేసి తెలుసుకోవచ్చన్నారు. అంధులు తమ ఓటు హక్కును బ్రెయిలీ లిపి ద్వారా రూపొందించిన ఓటు నమోదు యంత్రం ద్వారా అవగాహన కలిగించారు. కార్యక్రమంలో డిప్యూటీ తహసీల్దార్ ఎల్‌వీ సాగర్, పర్యవేక్షకులు కొలుకుల కిషోర్, వేమవరపు యశ్వంత్‌దీపు, జీడీవీఎస్ వీరభద్ర రావు, కేఎస్ఎస్ పవన్, పి.చంద్రశేఖర్ తదితరులు పాల్గొన్నారు.

ఏలూరులో ఎరువుల షాపుల్లో తనిఖీ


ఏలూరులో ఎరువుల దుకాణంలో తనిఖీ చేస్తున్న ఏడీఏ వెంకటమణి

ఏలూరు రూరల్ : ఎరువుల దుకాణ యజమానులు నిబంధనలు తప్పక పాటించాలని వ్యవసాయశాఖ మండపల్లి ఏడీఏ వెంకట మణి అన్నారు. శుక్రవారం ఆమె ఏలూరు మండల వ్యవసాయ అధికారిణి జీవనసంధ్యతో కలిసి పలు ఫెర్టిలైజర్స్ దుకాణాల్లో తనిఖీలు నిర్వహించారు. స్థానిక జాస్తి మల్లికార్జునుడు, శ్రీరాఘవేంద్ర షాపులు, వంగూరులో శ్రీసాయిచరన్ ఎరువుల దుకాణంలో అమ్మకాలు, కొనుగోళ్ల రికార్డులను పరిశీలించారు. ప్రభుత్వం అనుమతి పొందిన ఎరువులను మాత్రమే రైతులకు అమ్మాలన్నారు. వ్యవసాయశాఖ విధుల్లో భాగంగా వేరువేరు ప్రాంతాల అధికారులు తనిఖీలు నిర్వహిస్తుంటారని ఎంఏఓ వివరించారు.